క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : పట్టణంలోని 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ధనరాజ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ పరిధిలోని 33 కేవీ లేన్ వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు పలు ప్రాంతాలకు ఉదయం 7.00 గంటల నుంచి 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : అక్రమంగా కారులో తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా, ఉట్లపల్లి నుంచి మిర్యాలగూడ వైపు అతివేగంగా వెళ్తున్న ఇండికా కారును పోలీసులు వెంబడించి ఆపారు. కారులో పరిశీలించగా నాలుగు పెద్ద బస్తాల్లో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కారులో డ్రైవర్ కొండేటి అశోక్, కారు యాజమాని సైదమ్మతో పాటు బస్తాలు మోసేందుకు వచ్చిన రాజుతో పాటు పలువురు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యంతో పాటు కారును స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిటైర్డ్ ఇంజనీర్‌కు నివాళి

నిడమనూరు : మండలం రాజన్నగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఇంజనీర్ యదుళ్ల సత్యనారాయణ రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందాడు. మంగళవారం రాజన్నగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు హాజరై నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

పీఆర్‌టీయూ మండల నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

పెద్దవూర : పీఆర్‌టీయూ పెద్దవూర మండల నూతన కమిటీని మంగళవారం నిర్వహించిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇరుమాది పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నరాందాస్ దుర్గాప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి పాల్గొని నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తామని, తమ ఎన్నికకు సహకరించిన సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలో ప్రమాదవశాత్తు మృతిచెందిన గీత కార్మికుడు బల్గూరి శేఖర్ కుటుంబానికి కొండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ప్రతినిధులు రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ స్థానిక ప్రతినిధి బల్గూరి వెంకన్న అమెరికాలోని కానా ఫౌండేషన్‌కు శేఖర్ కుటుంబ పరిస్థితిని వివరించారు. వారు స్పందించి పంపించిన రూ.20వేలను ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య బల్గూరి కవితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు ఐతగోని వెంకటేశం, బల్గూరి హరీష్, శంకర్, కస్తూరి సురేష్, జంపాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు అందజేత

పెద్దవూర : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందించే వంట పాత్రలను మండల విద్యాధికారి తరి రాములు మంగళవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 36 పాఠశాలలకు వంట సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



పి.శైలజ 989 (బైపీసీ) కొండమల్లేపల్లి



హేమలత 988 (ఎంపీసీ) కొండమల్లేపల్లి



జి.జ్యోత్స్న 967 (సీఈసీ), కొండమల్లేపల్లి



డి. హిందు 986(బైపీసీ) కొండమల్లేపల్లి



జె. శ్రీలత 986(బైపీసీ), కొండమల్లేపల్లి



రక్షిత 976(ఎంపీసీ), కొండమల్లేపల్లి



బి. స్వాతి 456(ఎంపీసీ), కొండమల్లేపల్లి



సౌజన్య 975 గుర్రంపోడు



పెద్దఅడిశర్లపల్లి : విద్యార్థులను అభినందిస్తున్న మోడల్ స్కూల్ అధ్యాపకులు



కె.యగ్నేశ్ 985 నిడమనూరు



సహస్ర 982(ఎంపీసీ) నాగార్జునసాగర్



పానుగోటి నాన్సి, 971 నాగార్జునసాగర్

కొండమల్లేపల్లి : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. బీసీ గురుకుల బాలికల కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో డి.హేమలత(988), బైపిసి విభాగంలో పి.శైలజ 989 మార్కులు, సీఈసీ విభాగంలో జి.జ్యోస్న 967 మార్కులు, ప్రథమ సంవత్సర విభాగంలో ఎంపీసీలో జి.జ్ఞానేశ్వరి 462 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ఎస్సీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో జే.శ్రీలత, డి.హిందు 986 మార్కులు, ఎంపీసీ విభాగంలో ఎ.రక్షిత 976 మార్కులు, ఆర్.ప్రవళిక 974 మార్కులు, ప్రథమ సంవత్సర విభాగంలో బైపీసీ మొదటి సంవత్సరంలో సీహెచ్. రచన, వి.సుష్మిత, కె.జ్యోతి 440 మార్కులకు గాను 436 మార్కులు, ఎంపీసీ విభాగంలో బి.స్వాతి 456, ఎ.శృతి 455 మార్కులు సాధించారు. అలాగే ఎస్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర ఎంపీసీ విభాగంలో బి.నవ్య 933, బైపీసీ విభాగంలో ఈ.అనూష 895 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎం.హన్సిక 436, బైపీసీ విభాగంలో ఎస్. శిరీష 418 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. మొత్తానికి బీసీ గురుకుల బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 87 శాతం, ప్రథమ సంవత్సరం 72 శాతం, ఎస్సీ బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం వంద శాతం, ప్రథమ సంవత్సరంలో 92 శాతం, ఎస్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 89 శాతం, ప్రథమ సంవత్సరంలో 79శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లీశ్వరి, శౌరీలు, శారదలు ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దవూర : ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో బైపీసీ విభాగంలో విష్ణు వర్ధన్ నాయక్ 949, ఎంపీసీ విభాగంలో దత్తు 863 సాధించినట్లు తెలిపారు. ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో 98శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల మంగ్తా తెలిపారు.

డిండి : ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బి.మానస 979 మార్కులు, సీహెచ్.శ్రీవాణి 972, బైపీసీలో బి.శృతి 983, ఎం.మనీష 981, ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో బి.సన్ని 446 మార్కులు, ఆర్.అనూష 438 మార్కులు, బైపీసీలో బి.అంకిత 419 మార్కులు, ఎం.సబిత 417 మార్కులు సాధించారు. ఆదర్శ పాఠశాలలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ బి.అక్షిత 930 మార్కులు, బైపీసీలో ఎస్.సారిక 962 మార్కులు సాధించి ఆయా కళాశాలలో టాప్‌లో నిలిచారు.

గుర్రంపోడు : ఇంటర్ ఫలితాల్లో మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్, మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబర్చి విజయ కేతనం ఎగురవేశారు. మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం 113 మంది విద్యార్థులకు గాను 90మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 113మందికి గాను 108మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.రాగిణి తెలిపారు. పిట్టలగూడెంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో 38మందికి గాను 37మంది, ద్వితీయ సంవత్సరంలో 35మందికి గాను 35మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మహ్మద్ షారూఖ్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో పోలే స్వాతి 442మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో పిగిళ్ల సౌజన్య 975మార్కులతో ఉత్తమ మార్కులు సాధించారు. మైనార్టీ కళాశాల ద్వితీయ సంవత్సరంలో ఎఈసీ విభాగంలో ఇటికాల కౌశిక్ 800 మార్కులు సాధించగా సీఈసీ విభాగంలో దారం చరణ్ 923 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంఈసీలో మామిళ్ల చరణ్ 458, సీఈసీ విభాగంలో 418 మార్కులు సాధించారు.

'ఆదర్శ' విద్యార్థుల సత్తా..

నిడమనూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కే యగ్నేష్ 985(ఎంపీసీ), టీ. ప్రమోద్ 981(ఎంపీసీ), ఏ. జ్యోతి 940(బైపీసీ), ఎంఈసీలో రేణుక 669, కే తేజ 634 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పీ.భావన455(ఎంపీసీ), ఏ వర్షిత 428(ఎంపీసీ) జి వెన్నెల 346 (బైపీసీ), కే కావ్య405(సీఈసీ), ఎంఈసీ విభాగంలో పీ పల్లవి 444 మార్కులు సాధించారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలా అభినందించారు.

జిల్లా స్థాయిలో మొదటి స్థానం

నాగార్జునసాగర్ : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా స్థాయిలో మొదటి స్థానం లభించింది. ఆ కళాశాలకు చెందిన విద్యార్థి సహస్ర ఎంపీసీలో 982 మార్కులు సాధించింది. పోనుగోటి నాన్సి 971మార్కులు సాధించిందని ప్రిన్సిపాల్ దాసరి రాజశేఖర్ తెలిపారు.

బీసీ గురుకులంలో...

స్థానిక బీసీగురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 85.57శాతం ఉత్తీర్ణులుకాగా రెండో సంవత్సరం విద్యార్థులు 81.45శాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఎంపీసీ విభాగంలో గిరిబాబు 445మార్కులు, బైపీసీలో జయశంకర్ 424 మార్కులు సాధించినట్లు తెలిపారు. ద్వితీయలో ఎంపీసీలో సాయినాథ్ 973, సీఈసీలో వెంకటరమణ 930 సాధించినట్లు తెలిపారు.

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్ లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 87మంది విద్యార్థులకు గాను 38మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 114 మంది విద్యార్థులకు గాను 79మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో జి.మురళి 978 మార్కులు, ఆర్ నాగరాజు 964 మార్కులు,ఎంపీసీలో ఓ.బిందుప్రియ 951 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో పి.దీపిక 423 మార్కులు సాధించారు.

విజ్ఞానం పెంచుకుంటేనే విజయం



శ్రీ శ్లోక పాఠశాల ఉపాధ్యాయులతో మాజీ మంత్రి జానారెడ్డి

హాలియా : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకుంటేనే విజేతలుగా నిలుస్తారని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. హాలియా పట్టణంలోని శ్రీ శ్లోక పాఠశాలలో సోమవారం రాత్రి నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవం వికాస్–2025 సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వన చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్పొరేట్ స్థాయిలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్న శ్రీ శ్లోక పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. శ్రీ శ్లోక గ్రూపు ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కుకుడాల ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పాఠశాల మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం అహర్నిశలుగా పని చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ లక్ష్మి నారాయణ, హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, తెలంగాణ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వర్‌రెడ్డి, వికారాబాద్ సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు, హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించిన కేఎల్ఎన్ విద్యార్థులు



అస్రా, మేఘనలకు స్వీట్ తినిపించి అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మిర్యాలగూడ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి సత్తా చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో ఎస్‌కె.అస్రా 470 మార్కులకు 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించగా జూనియర్ బైపీసీలో కె.మేఘన 440 మార్కులకు 438 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకులు సాధించారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్‌లో కె.వంశీ ఎంపీసీలో 992 మార్కులు, ఎస్.పావని 990 మార్కులు సాధించగా సీనియర్ బైపీసీలో 985 మార్కులు, ఎస్‌కె.సఫియా 985 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రభాగాన నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా జూనియర్ ఎంపీసీలో 460 మార్కులకు పైగా 40 మంది, జూనియర్ బైపీసీలో 430 మార్కులకు పైగా పది మంది, సీనియర్ ఎంపీసీలో 980 మార్కులకు పైగా 20 మంది, సీనియర్ బైపీసీలో 15 మంది మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్, డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, చైతన్య ఆనంద్‌లు అభినందించారు.

సేంద్రియ ఎరువులతో రైతులకు మేలు

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్



మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్ కుమార్

చింతపల్లి : సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా భూసారం కాపాడడంతో పాటు రైతులకు ఎన్నో రకాల మేలు చేకూరుతుందని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) శ్రవణ్ కుమార్ అన్నారు. మంగళవారం చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు గ్రామంలోని రైతు వేదికలో మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కిసాన్ సంగోష్ఠి కార్యక్రమం లో భాగంగా సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రసాయనిక ఎరువులను వాడడం వల్ల ప్రతి ఏటా భూసారం తగ్గిపోతుందని, దీంతో రాబోయే రెండు, మూడు తరాల్లో వ్యవసాయానికి ఉపయోగపడే భూమి ఎక్కడా లేకుండా పోతుందన్నారు. భూసారాన్ని పరిరక్షించుకోవాలంటే కృత్రిమ రసాయన ఎరువుల వాడకాన్ని దశలవారీగా పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్క పౌరుడు ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని ఇందుకు రసాయన ఎరువులతో కూడిన పంట ఉత్పత్తులను తినడం వల్లనే ఈ అనారోగ్యాలు వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం లో ఏడీ. శ్రీలక్ష్మి, ఏఓ. శ్రావణ కుమారి, మద్రాస్ ఫర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మిర్యాలగూడ మేనేజర్ రామారావు, మౌనిక ఫర్టిలైజర్ మాల్ డీలర్ పూల యాదయ్య, పుల్లారెడ్డి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



పెద్దవూర : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సాగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, రాష్ట్ర అప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హాలియాలో నిర్వహించిన అనుముల మండల బీఆర్ఎస్ ముఖ్యనేతలతో సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25ఏళ్లు పూర్తికావడంతో వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మండల ముఖ్య నాయకులు, గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉన్నారు.

పెద్దవూర : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సాగర్ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నోముల భగత్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి,నాయకులు గోనె విష్ణు వర్ధన్‌రెడ్డి, జటావత్ రవి నాయక్, చెన్ను సుందర్‌రెడ్డి, రవి నాయక్, మెండె సైదులు, నడ్డి లింగయ్య, పాదిల శ్రీను, కొట్టె బాలయ్య, నడ్డి బాలరాజు, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

చింతపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ గ్రామ స్థాయి అధికారులు సూచించారు. మండలం పరిధిలోని తీదేడు గ్రామంలో మంగళవారం డీఎల్‌పీఓ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వన నర్సరీలతో పాటు గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి గ్రామ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి పారిశుద్ధ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పని ప్రదేశంతో పాటు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ సెంటర్, పల్లె దవాఖానాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పీస్ అశోక్ , మాజీ సర్పంచ్ కాయితీ జితేందర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, అంజమ్మ , యఫ్ ఏ చంద్రయ్య , లక్ష్మి , వెంకటమ్మ , స్వప్న, ఆశ వర్కర్ భాగ్యమ్మ, పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలి

హాలియా : విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని అనుముల మండల ఎంఈఓ గుండా కృష్ణమూర్తి అన్నారు. హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరు కోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతదేశ విశిష్టతను సమగ్రతను తెలియపరిచే ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు శైలజ, సైదులు, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, సైదిరెడ్డి, అరవింద్‌కుమార్, చెన్ను వెంకటరెడ్డి, వెంకట్రాంరెడ్డి, పార్వతమ్మ, కృష్ణవేణి, శకుంతల, శ్రీదేవి, కల్పలత, ముజాజాయిద్దీన్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు చేయాలి

మిర్యాలగూడ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై తల్లిదండ్రులు తరుచుగా సమీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేయాలని దామరచర్ల మండల ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం దామరచర్ల మండలంలోని కల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ధీరావత్ బుజ్జి లింగానాయక్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో నెలకొల్పిన మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్‌లను విద్యార్థులు ఉపయోగించుకోని గుణాత్మక విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధీరావత్ శారదాపాచునాయక్, గ్రామ కార్యదర్శి విజయ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గొబ్బూరి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నిర్మూలన



మిర్యాలగూడ టౌన్ : ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు



అడవిదేవులపల్లి : కొత్తనందికొండలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగరాణి



తిరుమలగిరి : అల్వాలలో అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మిర్యాలగూడ టౌన్ : పోషకాహారంతో రక్తహీనతను నిర్మూలించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పేర్కొన్నారు. అర్బన్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం-1, 2, 3లో, ఎన్ఎస్‌పీ సెక్టార్ పరిధిలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో, మండలం చిల్లాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఆట ఆధారిత అభ్యాసంపై ప్రదర్శన నిర్వహించారు. పలు అంశాలపై గర్భిణులకు, బాలింతలకు, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, లీలాకుమార్, పద్మ, వాణి, ఎంపీడీఓ శేష గిరిశర్మ, అంగన్‌వాడీ టీచర్లు బెజ్జం నాగమణి, రహేనా సుల్తానా, అంజలీదేవి, హెల్పర్లు శిరసనగండ్ల హైమావతి, నాగలక్ష్మి, సైదమ్మ, తల్లులు కల్పన, యాదమ్మ, సరిత, విజయ, రజని, స్వరూప, నాగలక్ష్మి, భారతీ, ఆయా మంగమ్మ, ఆర్‌పీ విజయ, ఎంపీఓ రమేశ్, కార్యదర్శి జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు బుజ్జి, నాగలక్ష్మి, హెల్పర్ ద్వాలీ, ఆశా వర్కర్ మంగమ్మలతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండలం కొత్తనందికొండ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాధవి, వినోజ, ఆశా వర్కర్ నాగమణిలతో పాటు హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గర్భిణులు ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని అల్వాల గ్రామపంచాయతీలో పోషన్ పక్షంలో భాగంగా పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, తాజా మాజీ సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సైదా నాయక్, అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారీ, పద్మ, జ్యోతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

చందంపేట : గర్భిణులు, కిశోర బాలికలు రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.శోభ అన్నారు. మంగళవారం నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ సెక్టార్ లో పోషణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంతకుముందు 3నుంచి ఆరేళ్ల పిల్లల గ్రాడ్యుయేషన్ డే లో భాగంగా పోషకాహార విలువలు తెలియజేస్తూ నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు అరుణ, భాగ్యమ్మ, శోభ, నీలా, లక్ష్మి, అంబాలి, శారద, జయమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తెల్దేవర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, కిశోర బాలికలకు పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. అంతకుముందు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రసన్న, టీచర్లు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



గుర్రంపోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

గుర్రంపోడు : కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చే రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం కొనుగోళ్లను సజావుగా కొనసాగించాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గుర్రంపోడు మండలం కాచారం, చామలోనిబావి, కోయగూరోనిబావి, వట్టికోడు ఐకేపీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సకాలంలో పేమెంట్ జరిగే విధంగా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. హమాలీలకు కేటాయించిన రూ.45 మాత్రమే చెల్లించాలని అదనంగా రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట ఏపీఎం ఊరుపక్క యాదయ్య, సీసీ శేఖరయ్య, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

పట్టపగలు విద్యుత్ వెలుగులు

- గ్రామాల్లో నిరంతరం వెలుగుతున్న వీధి లైట్లు
- వృథా అవుతున్న విద్యుత్
- పంచాయతీలపై బిల్లుల భారం



త్రిపురారం బాబుసాయిపేట రోడ్డులో పట్టపగలు వెలుగుతున్న ఎల్ఈడీ వీధి లైట్లు

త్రిపురారం : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు పగలు రాత్రి నిరంతరం వెలుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పగలు రాత్రి వెలగడంతో విద్యుత్ బిల్లు కూడా అధికంగా వస్తుంది.. దీంతో పంచాయతీలపై అధిక భారం పడడంతో ప్రజా ధనం వృథా అవుతుంది. బల్బులు పగటి పూట వెలగకుండా ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా కొందరు పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడం, ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో విలువైన విద్యుత్‌ను వృథా చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్యుత్ అధికారులైన పంచాయతీ కార్యదర్శులతో సమన్వయంతో గ్రామాల్లోని వీధి దీపాలకు ఆన్ ఆఫ్‌స్విచ్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ వృథాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసుకోవాలి



పగటిపూట వీధి దీపాలు వెలగడం వల్ల విద్యుత్ బిల్లు భారం పంచాయతీలపై పడుతుంది. గ్రామ పంచాయతీ బాధ్యులు విద్యుత్‌ను వృథా చేయకుండా స్తంభాల వద్ద ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడా కరెంటు కోతలు లేకుండా నిత్యం చర్యలు తీసుకుంటున్నాం.

బాలునాయక్, విద్యుత్ ఏఈ, త్రిపురారం